# 7న జరిగేది 30 ఏండ్ల పోరాట ప్రదర్శన

- **లక్ష డప్పులు-వెయ్యి గొంతులకు అనుమతి నిరాకరణ బాధాకరం: మందకృష్ణ**

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల పోరాటంలో ఏనాడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని, గాంధేయ మార్గంలోనే పోరాటం సాగించామని మందకృష్ణ మాదిగ తెలిపారు. పలు సాకులను ఎత్తిచూపుతూ లక్ష డప్పులు-వెయ్యి గొంతులు కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం తగదని సూచించారు. సోమవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'మాదిగ సంస్కృతికి చిహ్నం డప్పు. మా 30 ఏండ్ల వర్గీకరణ పోరాటానికి ఊపిరిపోసింది కూడా ఈ డప్పే. ప్రస్తుతం డప్పు సంస్కృతి కనుమరుగవుతున్నది. ఈ తరుణంలో చరిత్రను గుర్తుచేసే విధంగా, గుర్తుంచుకునే విధంగా లక్ష డప్పులు-వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని ఈ నెల 7న నిర్వహించాలని నిర్ణయించాం. దీనిని ప్రభుత్వం ఓ సాంస్కృతిక ప్రదర్శనగా చూడాలి. అంతేగానీ ట్రాఫిక్ జామ్ అవుతదని, వీవీఐపీ జోన్ కాబట్టి శాంతిభద్రతలకు విఘాతం కలుగుతదని సాకులు చూపిస్తూ అనుమతి నిరాకరించడం తగదు. గాంధేయ మార్గంలోనే ప్రదర్శన నిర్వహిస్తాం. ప్రభుత్వానికి మరోసారి లేఖ ద్వారా విన్నవిస్తాం. ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చేలా సానుకూలంగా స్పందించాలి' అని కోరారు. సమాజంలో ప్రతి ఉద్యమానికి డప్పు ప్రధానమైనదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని మందకృష్ణ సూచించారు. మీడియా సమావేశంలో తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ, దరువు ఎల్లన్న, సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్, రెడ్డి జాగృతి అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ల బిక్షపతి మాదిగ, రాజేందర్, నరసింహ, బైరపోగు శివకుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి నిరాకరణ.. మాదిగలను విస్మరించడమే

- **మహా ప్రదర్శనతో రేవంత్‌కు నష్టమేంటి?: వంగపల్లి**

*సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్*

ముషీరాబాద్, ఫిబ్రవరి 3: ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేల గొంతులు' మహా ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడమంటే మాదిగ సమాజాన్ని విస్మరించడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల సభలు, సమావేశాలకు అనుమతినిస్తున్న ప్రభుత్వం మాదిగల పట్ల వివక్ష ఎందుకు ప్రదర్శిస్తున్నదని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో వంగపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. మాదిగల ఐక్యతను చాటేందుకుగాను 'లక్ష డప్పులు-వేల గొంతులు' కార్యక్రమాన్ని చేపడుతుంటే అడ్డుకోవడం తగదని సూచించారు. అయినా తమ జాతి అస్థిత్వాన్ని ప్రదర్శిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాగే వివక్ష పూరితంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, 7వ తేదీన లక్షలాది మందితో హైదరాబాద్‌ను నిర్బంధిస్తామని వంగపల్లి హెచ్చరించారు.

# తాండూరు దవాఖానకు కొడంగల్ పేరు

మొదటిపేజీ తరువాయి...

ఎలాంటి సమాచారం లేకుండా ఒక్కసారిగా పేరు మార్చడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో మెడికల్ కళాశాలను ఏర్పాటుచేయడంలో భాగంగా తాండూరు దవాఖానను దానికి అనుసంధానంగా చేసే కుట్రలో భాగంగానే పేరు మార్చినట్టు ఆరోపించారు. తాండూరు నియోజకవర్గాన్ని కొడంగల్‌గా మార్చి ఇక్కడి ఎమ్మెల్యేను కొడంగల్ ఎమ్మెల్యేగా చేస్తారా..? ప్రజలను కొడంగల్‌వాసులుగా మారుస్తారా..? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వివక్షపాలనలో భాగంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకే ఇలాంటి పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై దవాఖాన అధికారులను నిలదీస్తే తమకేమీ తెలియదని, కాంట్రాక్టర్ వచ్చి బోర్డు పెట్టినట్టు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కొడంగల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకోసం తాండూరు జిల్లా దవాఖానను ఇలా పేరు మార్చి వాడుకుంటున్నారని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరుకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి తీరును ఖండిస్తున్నట్టు ప్రకటించారు.

# 'ఎస్సీ'పై వెనక్కి తగ్గిన సర్కార్

- **క్యాబినెట్ సబ్‌కమిటీకి ఎస్సీ వర్గీకరణ నివేదిక**
- **అందజేసిన షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్**
- **సమగ్ర సర్వే వెల్లడించినందుకు మంత్రులపై సీఎం సీరియస్**
- **ఆ ప్రభావంతో ఎస్సీ నివేదికను వెల్లడించని వైనం**
- **క్యాబినెట్‌లో చర్చించాకే వెల్లడిస్తామని ప్రకటన**

హైదరాబాద్, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు నివేదికను సోమవారం వెల్లడిస్తామంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తీరా వెనక్కి తగ్గింది. క్యాబినెట్‌లో చర్చించిన అనంతరమే నివేదికను వెల్లడిస్తామంటూ మాటమార్చింది. సమగ్ర సర్వే వివరాల వెల్లడితో క్యాబినెట్ సబ్‌కమిటీపై సీఎం రేవంత్ అభ్యంతరాల నేపథ్యంలో దీనిపై ప్రభావం పడింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన సబ్‌కమిటీ సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు అంశాలపై సిఫారసు చేసేందుకు ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏక సభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిటీ తన నివేదికను సోమవారం క్యాబినెట్ సబ్ కమిటీకి అందజేసింది. ఉత్తమ్ నేతృత్వంలోని కమిటీ నివేదికలోని అంశాలపై చర్చించింది. క్యాబినెట్ సమావేశంలో చర్చించి, ఆపై అసెంబ్లీలో నివేదించనున్నట్టు తెలుస్తున్నది.

### 1970 దశకంలోనే వర్గీకరణకు ఆజ్యం

ఎస్సీ వర్గీకరణ నివేదిక వెల్లడిపై డైలమా నెలకొన్నట్టుగా తెలుస్తున్నది. ఎస్సీలకు రాజ్యాంగబద్ధంగా 15% రిజర్వేషన్ అమలవుతున్నది. అయితే, తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని మాదిగలు పోరుబాట పట్టడంతో ఎట్టకేలకు ఈ అంశంపై 1995లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. మాదిగల వాదన నిజమేనని సమర్థిస్తూ ఆ కమిషన్ 1996లో నివేదికను సమర్పించగా, దాని ఆధారంగా 1997 జూన్‌లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం 15% ఎస్సీ కోటాను ఏ,బీ,సీ,డీగా విభజిస్తూ జీవోను విడుదల చేసింది.

### 1997లో ఎస్సీ వర్గీకరణ జీవో వివరాలు

- 'ఏ' గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలు సహా మొత్తం 12 కులాలను కలుపుతూ వారికి 1 % కోటాను ఇచ్చారు. వాటిని అట్టడుగు స్థానంలో ఉన్న కులాలుగా గుర్తించారు.
- 'బీ' గ్రూపులో మాదిగ, దాని ఉపకులాలు - మొత్తం 18 కులాలను చేరుస్తూ వారికి 7% కోటాను కేటాయించారు.
- 'సీ'లో మాల, దాని ఉపకులాలు - మొత్తం 25 కులాలను చేరుస్తూ వారికి 6% కోటా ఇచ్చారు.
- 'డీ' లో ఆది ఆంధ్రులతో పాటు మొత్తం 4 కులాలను చేర్చి, 1% కోటాను నిర్ణయించారు.

### 2000లో హేతుబద్ధీకరణ చట్టం

వాస్తవంగా ఏ, బీ గ్రూపుల కులాలు తక్కువ లబ్ధి పొందాయని, సీ, డీ గ్రూపుల కులాలు తమ జనాభా శాతానికి మించి లబ్ధిని పొందాయని కూడా 1997లోనే గుర్తించారు. ఆ తర్వాత 2000లో ఏపీ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరిస్తూ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఈ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో అమలులోకి వచ్చింది. ఎస్సీలను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా వర్గీకరిస్తూ, వెనుకబాటుతనం, జనాభా నిష్పత్తి ప్రకారం ఆ కులాలకు రిజర్వేషన్ కోటాను అమలుచేశారు. కానీ 2004లో సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేయడంతో ఈ చట్టానికి మరోసారి చుక్కెదురైంది. ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని తేల్చిచెప్పింది. నాటి నుంచి పెండింగ్‌లోనే ఉన్నది.

### సుప్రీం ధర్మాసనం తీర్పుతో కదలిక

గత ఆగస్టులో సుప్రీంకోర్టుకు చెందిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని తేల్చిచెప్పింది. ఆ తీర్పును అధ్యయనం చేసి, తగు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీతోపాటు, హైకోర్టు విశ్రాంత జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. అయితే ఆ కమిషన్ నివేదికను అందజేసింది. వర్గీకరణ అమలుకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలా? లేదంటే తాజా ఇంటింటి సర్వే గణాంకాలా? అనే అంశంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టతకు రాలేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో నివేదిక వెల్లడికి డైలమాలో పడ్డట్టు తెలుస్తున్నది.

# ఇంటింటి సర్వే నివేదిక వెల్లడిపై సీఎం ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వే నివేదికను వెల్లడించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. క్యాబినెట్‌లో పెట్టకుండానే, చర్చించకుండానే నివేదికను ఎలా బయటకు విడుదల చేస్తారని క్యాబినెట్ సబ్ కమిటీపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. గత నవంబర్‌లో చేపట్టిన ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల) నివేదికను ప్లానింగ్ శాఖ తాజాగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘానికి అందజేసింది. ఆ నివేదికను క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్, కమిటీ సభ్యులైన మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి సచివాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ జనాభా వివరాలను ప్రకటించారు. అయితే ఆ వివరాల వెల్లడిపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. క్యాబినెట్‌లో చర్చించకుండానే ఎలా బయటపెడతారని సబ్‌కమిటీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

# భట్టితో బీసీ కమిషన్ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పలు కులాలకు సంబంధించిన పేర్లలో మార్పులు, చేర్పులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీరంగు పాల్గొన్నారు.

## లోకం పోకడ




**డుప్లికేట్ గవర్నమెంటులో రియాలిటీ ఎక్కడుంటుంది గురూ?**

## అసెంబ్లీ తీర్మానం పేరిట కాంగ్రెస్ డ్రామా

రాష్ట్రంలో ఓసీలు 6% లోపే ఉన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ సర్వే ప్రకారం ఓసీలు 15 శాతానికి పైగా ఉన్నట్టు ప్రకటించారు. దీన్ని బట్టే ఈ సర్వే సమగ్రంగా లేదని అర్థమవుతోంది. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద డ్రామా ఆడుతున్నది. తాము అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, కానీ కేంద్రం ఈ రిజర్వేషన్లకు అంగీకరించలేదని ఎన్నికల్లో ప్రచారం చేసుకోవాలని కాంగ్రెస్ చూస్తున్నది.

**-యూఎస్ ప్రకాశ్‌రావు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, అశ్వారావుపేట**

## బీసీల సంఖ్యలో తప్పుడు లెక్కలు

కాంగ్రెస్ ప్రభుత్వ కులగణన సర్వేలో బీసీల సంఖ్యలో తప్పుడు లెక్కలు చూపారు. ఇది బీసీలకు ముమ్మాటికీ అన్యాయమే. రానున్న కాలంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తుందన్న దురుద్దేశంతోనే ఇలా కులగణన గణాంకాల్లో తప్పుడు లెక్కలు చూపించింది. ఈ సర్వే లెక్కలతోనే బీసీలకు ఉన్న భ్రమలు కూడా తొలిగిపోయాయి. ఆరు నూరైనా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.

**- దిండిగాల రాజేందర్, బీసీ నాయకుడు**

## ఈ కులగణన ఆమోదయోగ్యం కాదు

ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఆమోదయోగ్యం కాదు. బీసీ జనాభాను తక్కువ చేసి చూపించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తా. 2015లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 51% ఉన్నదని, పదేండ్ల తర్వాత అది మరింత పెరగాల్సి ఉండగా, తగ్గడం ఏమిటి? బీసీ, మైనార్టీలతో కలుపుకొని 62%గా ఉన్న బీసీ జనాభాను రాష్ట్ర ప్రభుత్వం 56%గా చూపుతూ అన్యాయం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు.

**- డాక్టర్ తిరునగరి శేషు, బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్**

## సర్వే పూర్తికాకుండానే ప్రకటించారు

కులగణన సర్వే పూర్తికాకుండానే కాంగ్రెస్ మంత్రులు లెక్కలు ప్రకటించారు. కాంగ్రెస్ చెప్పిన లెక్కలకు, సర్వేకు ప్రజల్లో విశ్వసనీయత లేదు. కేవలం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు దండుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్ర ఇది. ప్రజాపాలన పేరిట ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఏ ఎన్నికల్లోనైనా ఓట్లతో బుద్ధి చెప్పడం ఖాయం.

**-జూకంటి శ్రీశైలం, కురుమ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి, జనగామ**

## స్థానిక ఎన్నికల్లో 56% అమలు చేయాలి

కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు మైనార్టీలతో కలుపుకొని స్థానిక ఎన్నికల్లో 56.3% బీసీ రిజర్వేషన్లు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. బీసీ కుల గణన నివేదిక తప్పుల తడకగా ఉన్నది. కేసీఆర్ గతంలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి ఒకే రోజులో కులగణనను పూర్తిచేశారు. ప్రస్తుతం మైనార్టీలు కాకుండా బీసీల జనాభాను తక్కువ చేసి కేవలం 46.25% మాత్రమే ఉన్నదని చెప్పున్నారు.

**- అల్లం రవీందర్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

## సర్వే అంతా అసమగ్రం

బీసీ కులగణన తప్పుడు నివేదికగా ఉన్నది. ఎన్నికల కోసమే దీనిని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది బీసీలు ఉన్నప్పటికీ వారు వివిధ ప్రాంతాలకు పనుల కోసం వెళ్లడంతో వారి పేర్లు నమోదు కాలేదు. అందుబాటులో ఉన్న వారి వివరాలు మాత్రమే నమోదు చేశారు. తాళం వేసి ఉన్న ఇండ్ల పక్కనున్న వారు చెప్పిన వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేశారు.

**- బండి రమేశ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు, నర్సింహులపేట, మహబూబాబాద్ జిల్లా**

## సర్వేపై కాంగ్రెస్ సర్కార్ అబద్ధాలు

50% కూడా పూర్తికాని సమగ్ర సర్వేను 80% పూర్తయినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం విడ్డూరం. ఎన్యూమరేటర్లు చాలా ఇండ్లను వదిలేయడం వల్ల సమగ్ర సర్వే ఎలా అవుతుంది? సేకరించిన డాటాలో కచ్చితత్వం లేదు. తక్షణమే 15 రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి 100% కులగణన చేయాలి. రీ సర్వే అనంతరమే నివేదికకు చట్టబద్ధత కల్పించి స్థానిక ఎన్నికల్లో బీసీలకు 56% రిజర్వేషన్లు కల్పించాలి.

**- బత్తిని శివశంకర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు**

# డిప్యూటీ సర్వేయర్లుగా ఎలా నియమిద్దాం?

- **రెవెన్యూ శాఖ కసరత్తు**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను డిప్యూటీ సర్వేయర్లుగా నియమించడానికి రెవెన్యూ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతం ఇతర శాఖల్లో ఉన్నవారిని సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి తీసుకురావడంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్వీసు నిబంధనలకు సంబంధించి స్పష్టత ఇవ్వాలంటూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను సర్వే విభాగం కమిషనర్ ఇటీవల కోరారు. దీంతో ఈ అంశంపై అధ్యయనం చేసి వివరాలు అందజేయాలంటూ నవీన్ మిట్టల్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

# చలి పోయినట్టే

- **రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. గత నెలలో ఉత్తర దిశ నుంచి వీచిన గాలుల దిశ మారడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. చలి తీవ్రత తగ్గి ఎండలు పెరుగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో పగటిపూట 34 నుంచి 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రివేళ 12 నుంచి 22 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటున్నది. మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్తు డిమాండ్ కూడా పెరుగుతున్నది.

# నేడు తిరుమలలో రథసప్తమి వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తేతెలంగాణ) : తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. శ్రీవారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఉదయం సూర్యప్రభ వాహనసేవతో ప్రారంభంకానున్న వేడుకలు, రాత్రి చంద్రప్రభ వాహనసేవతో ముగియనున్నట్టు వెల్లడించారు. ఉదయం 5:30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనసేవ, 9 నుంచి 10 గంటల వరకు చిన్న శేషవాహన సేవ, 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనసేవ, ఒంటిగంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనసేవ, 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్ప వృక్ష వాహనసేవ, 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనసేవ, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనసేవ నిర్వహించనున్నట్టు వివరించారు. రథసప్తమి వేడుకల దృష్ట్యా మంగళవారం ఆర్జితసేవలను రద్దు చేసినట్టు ఈఓ శ్యామలరావు వెల్లడించారు.

# పంటల ధరల పతనం.. సర్కారు పలాయనం

- **ఈ సీజన్‌లో మార్కెట్లో ఘోరంగా పడిపోయిన అనేక పంటల ధరలు**
- **వేరుశనగ, మిర్చి, కంది రైతుల పరిస్థితి మరింత దయనీయం**
- **మద్దతు ధర కోసం ఆందోళనలు**
- **పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం**
- **అచేతనావస్థలో మార్క్‌ఫెడ్**
- **కేంద్రం అనుమతిస్తేనే కొనుగోలు.. లేదంటే చేతులెత్తేస్తున్న రాష్ట్ర సర్కారు**
- **కాంగ్రెస్ సర్కారుపై రైతుల ఆగ్రహం**

### కంది కొనుగోళ్లకు కోత

*మద్దతు ధర పడిపోయి ఇబ్బంది పడుతున్న కంది రైతులకు.. ప్రభుత్వం నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. కందుల కొనుగోలులో కోత పెట్టడమే ఇందుకు కారణం. మార్కెట్లో కందులకు ధర పడిపోవడంతో మద్దతు ధరకు కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఎకరానికి మూడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో సగటు దిగుబడి ఎకరానికి 6-8 క్వింటాళ్ల వరకు ఉంటుంది. టీడీఆర్‌జీ 59 రకంతో అలంపూర్ రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు పండిస్తున్నారు. సర్కారు ఎకరానికి మూడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తే ఆ రైతు మిగిలిన 7 క్వింటాళ్లు ఎక్కడ అమ్ముకోవాలనేది ప్రశ్న. ఈ విధానంపై ఆదిలాబాద్, గద్వాల, వనపర్తి, వికారాబాద్, సిద్దిపేట రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సమస్యను గుర్తించిన ఆయా జిల్లాల కలెక్టర్లు కొనుగోలు పరిమితిని ఎకరానికి మూడు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్లకు పెంచాలని ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.*

**వివిధ పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర, రాష్ట్రంలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధర (క్వింటాల్‌కు రూపాయల్లో..)**

| పంట | మద్దతు ధర | మార్కెట్ ధర |
|---|---|---|
| పత్తి | 7,521 | 5,000- 6,000 |
| సోయాబిన్ | 4,892 | 4,000 |
| జొన్నలు | 3,421 | 2,000- 3,000 |
| ధాన్యం | 2,320 | 1,900- 2,000 |
| కందులు | 7,550 | 6,000 |

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఈ సీజన్‌లో అనేక పంటలకు మద్దతు ధర దక్కక రైతులు తల్లడిల్లుతున్నారు. ముఖ్యంగా వేరుశనగ, మిర్చి, కంది పంటలు సాగు చేసిన రైతులు అరిగోస పడుతున్నారు. మద్దతు ధర కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. అయినా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందనలేదు. మార్కెట్లో పంటల ధరలు పడిపోయిన వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. పంటల కొనుగోళ్లతోపాటు దళారులను కట్టడి చేయడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి.

### వేరుశనగ, మిర్చి రైతుల గగ్గోలు

వేరుశనగ, మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ పంటల ధరలు భారీగా పడిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొన్నది. దీంతో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. నిరుడు మిర్చి క్వింటాల్‌కు రూ.25 వేల ధర పలకగా, ఈ సీజన్‌లో రూ.12 వేలకు పడిపోయింది. దీనికితోడు మిర్చి పంటకు తామర పురుగు సోకడంతో దిగుబడి కూడా భారీగా పడిపోయింది. ఇటు ధర, అటు దిగుబడి సగానికి సగం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ధర, దిగుబడి పతనంతో రైతులకు పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొన్నది. వేరుశనగ రైతులది మరో గోస. గడిచిన పదేండ్లలో ఎప్పుడూ వేరుశనగ ధర పతనం కాలేదు. పల్లీకి మద్దతు ధర రూ.6,783 ఉండగా, వ్యాపారులు మూడు నుంచి ఐదు వేలకు మించి ఇవ్వడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అచ్చంపేట మార్కెట్‌పై దాడి చేశారు. మహబూబ్‌నగర్‌లోని బోయపల్లిలో ధర్నా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో వేరుశనగ రైతులు మద్దతు ధర కోసం ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ, మిర్చికే కాదు మిగిలిన పంటలకు కూడా ధరలు పడిపోయాయి.

### సర్కారు విఫలం

సాధారణంగా మార్కెట్లో పంటలకు మద్దతు ధర దక్కే పరిస్థితి లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి, రైతులకు అండగా నిలబడాల్సి ఉంటుంది. కానీ, ఈ పని జరగడం లేదు. మిర్చి, వేరుశనగ రైతులు ఆందోళనలు చేస్తున్నా, ఈ పంటల కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం. మార్క్‌ఫెడ్ సాధారణంగా మార్కెట్లో ధర లేని పంటలను కొనుగోలు చేస్తుంది కాబట్టి, డిమాండ్ లేని పక్షంలో ఆ పంటలను తర్వాత నష్టానికే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అయితే, రైతుల నుంచి మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేసి, ఆ తరువాత నష్టానికి అమ్మాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నను ప్రభుత్వ పెద్దలు పలుమార్లు వ్యక్తంచేసినట్టు తెలిసింది. ప్ర